కాకినాడ ఎంపీ ఉదయ్ డీపీతో వాట్సాప్ మెసేజ్

» టీటైమ్ చీఫ్ ఫైనాన్స్ అధికారి నుంచి రూ.92.5 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

» కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సైబరాబాద్ పోలీసులు

మెయిన్‌లో..

నేపాల్‌లో చిక్కుకున్న తల్లీకూతురు

» 3న టూరిజం ప్యాకేజీలో పర్యాటకులతో కలిసి పయనం

» నేడు ప్రత్యేక విమానంలో రాక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడ నెలకొన్న ఆందోళనకర పరిస్థితుల కారణంగా చిక్కుకున్న తెలుగువారిలో కాకినాడ నగరానికి చెందిన తల్లీకూతుళ్లు ఉన్నారు. దీంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. కాకినాడ నగరానికి చెందిన బుద్ధరాజు సత్యనారాయణ భార్య బుద్ధరాజు సరళ(65), కుమార్తె దాట్ల రోజారాణి(45) నేపాల్‌లోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు ఈనెల 3వతేదీ ఉదయం విశాఖనుంచి 38మంది పర్యాటకులతో కలిసి బయలుదేరి వెళ్లారు. పదిరోజుల ప్రత్యేక టూరిజం ప్యాకేజీలో భాగంగా అన్నిముఖ్యమైన ప్రాంతాలను తిలకించి ఈనెల 13న వీరంతా తిరిగి వైజాగ్ చేరుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఆ బృందం దాదాపుగా అన్నిప్రాంతాలను తిలకించారు. ఈ నెల 7న కాట్మండులోని గౌషాలాలో వీరు బస చేసిన హోటల్ రాయల్ కుసుమ్‌కు చేరుకున్నారు. ఇంతలో నేపాల్‌లో నెలకొన్న ఆందోళన పరిస్థితులు, హింసాత్మక సంఘటనలతో వీరు హోటల్‌నుంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని కుమార్తె దాట్ల రోజారాణి తన తండ్రి సత్యనారాయణ, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న తన కుమారుడు సంజయ్‌వర్మలకు తెలియజేయడంతో వారు విషయాన్ని ఫోన్ ద్వారా మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన బాధితులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యాన్నిచ్చారు. మరోవైపు కాట్మండులో కాకినాడకు చెందిన తల్లీకూతురు చిక్కుకోవడంపై కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు స్పందించారు. ఆయన కూడా మంత్రి లోకేశ్‌కు విషయాన్ని తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న వారందరినీ క్షేమంగా ఇంటికి చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తన భార్య సరళ, కుమార్తె రోజారాణి క్షేమంగానే ఉన్నారని, గురువారం ఉదయం ప్రత్యేక విమానంలో విశాఖ, అక్కడినుంచి కాకినాడ చేరుకుంటారని బుద్ధరాజు సత్యనారాయణ తెలిపారు.



నేపాల్‌లో తల్లీకూతురు సరళ, రోజారాణి

'ఆటో' పేమెంట్





ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. దసరా రోజున ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు ప్రకటించింది. స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలవుతున్న నేపథ్యంలో ప్రయాణికులు తగ్గిపోయి ఆర్థికంగా నష్టపోతున్నందున వీరిని ఆర్థికంగా ఆదుకోనున్నట్టు సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఆటోవాలాలకు ఆర్థిక సాయం పథకం దసరాకు ప్రారంభించనున్నట్లు అనంతపురం సభలో బుధవారం అధికారికంగా ప్రకటించడంతో ఆటో కార్మికుల్లో హర్షాతిరేకాలు మిన్నంటుతున్నాయి.

» ఆటో కార్మికులకు ప్రభుత్వం తీపికబురు

» స్త్రీశక్తి పథకం నేపథ్యంలో నష్టపోతున్న ఆటోవాలాలకు ఏటా రూ.15 వేలు

» దసరా రోజున పథకం ప్రారంభించనున్నట్టు ప్రకటించిన సీఎం చంద్రబాబు

» ఉమ్మడి జిల్లాలో 46 వేల ఆటో కార్మికులకు రూ.69 కోట్ల వరకు ఆర్థిక లబ్ధి

» ఇప్పటికే హరిత పన్ను తగ్గించడంతో ఆటోలకు భారీగా తగ్గిన పన్ను భారం

(కాకినాడ,అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం వరం ప్రకటించింది. ఆటో కార్మికుల కుటుంబ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు బుధవారం ప్రకటించారు. సూపర్‌సిక్స్ పథకాల సక్సెస్ సందర్భంగా అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. గత నెల 15వ తేదీ నుంచి మహిళలకు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణాల కారణంగా ఆటోడ్రైవర్ కార్మికుల కుటుంబాలకు ఆర్థిక తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత కొన్ని రోజుల నుంచి ఆటో కార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. అదే సమయంలో ఉచిత ప్రయాణం అమలు నేపథ్యంలో ఆటోకార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు ఒక్కో ఆటోవాలాకు అక్టోబరు 2న విజయదశమి రోజున ఆటో కార్మికులకు రూ.15వేల వంతున సాయాన్ని అందిస్తామని సీఎం చేసిన ప్రకటనతో ఆటో కార్మికుల్లో సంబరాలు మిన్నంటుతున్నాయి. పూట గడవడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సాయం వేలాది ఆటో కార్మికుల జీవితాలకు ఆర్థిక భరోసా నింపనుందని ఆటో కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 46 వేల వరకు ఆటోలున్నాయి. ఇందులో కాకినాడ జిల్లాలో 13,194, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 17వేల వరకు ఆటోలున్నట్టు రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఆటోయూనియన్లు మాత్రం 50 వేలపైనే ఆటోలు ఉంటాయని చెబుతున్నాయి. ఈ పథకం అమలైతే ఉమ్మడి జిల్లాకు రూ.69 కోట్ల వరకు నిధులు కావలసి ఉంది.

అప్పట్లో ఊరించి ఊరించి అరకొరే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేల సాయాన్ని అందించారు. అదీ లబ్ధిదారులను ఎడాపెడా కోసేసి సంఖ్య తగ్గించేశారు. పైగా ఆటో కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు జమ అయిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీవోలను రంగంలోకి దించింది. చలాన్ల పేర్లతోను, రవాణాశాఖ నిబంధనల పేరుతోను రకరకాల ఫైన్‌లు విధించి ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో లాగేసుకునేది. పైగా వాహనమిత్ర పథకాన్ని కొంతకాలమే అమలుచేసి గాలికి వదిలేశారు. ఇక దసరా నుంచి అమలుకానున్న పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలు జారీచేయనుంది. పథకానికి అర్హత సాధించడానికి నిబంధనలపై స్పష్టత ఇవ్వనుంది. సొంత ఆటో ఉన్నవారు, అలాగే అద్దెకు తీసుకుని నడుపుతున్న కార్మికులు ఉమ్మడి జిల్లాలో చాలామంది ఉన్నారు. ఈనేపథ్యంలో సొంత ఆటో లేని కార్మికులకు సాయం ఉంటుందా? లేదా? అనేదానిపై స్పష్టత రానుంది. ఇదిలా ఉంటే గతంలో ఆటోలు ఉన్నప్పటికీ ఆటో నడిపే లైసెన్సు, బ్యాడ్జీలు కలిగిన వారికి మాత్రమే పథకం వర్తింపజేశారు. ఈ నేపథ్యంలో కొత్త మార్గదర్శకాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది. దీనిపై కోనసీమ జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావును వివరణ కోరగా ప్రభుత్వం జారీ చేయనున్న మార్గదర్శకాల ద్వారానే ఎంత మంది లబ్ధిపొందుతారనేది తేలనుందని చెప్పారు.

మేలో హరిత పన్నుతో ఆనందం..

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి కోట్లలో పిండేసింది. హరిత పన్ను పేరుతో ఎవరినీ వదలకుండా రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. లారీలు, టిప్పర్లు, కార్లు, ఆటోలు, స్కూలు బస్సులు, చివరకు బైక్‌లను కూడా పన్ను పేరుతో జేబులు గుల్లచేసేసింది రవాణా, రవాణాయేతర రంగాలకు సంబంధించి ఆయా వాహనాల నుంచి ఉమ్మడి జిల్లాలో రవాణా శాఖ అధికారులు హరితపన్నును వసూలు చేసేవారు. బైక్ నుంచి లారీ, టిప్పర్, ఆటో, స్కూల్ బస్సుల వరకు వాహనం రిజిస్ట్రేషన్ జరిగిన తేదీ నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. కానీ 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాల వాహనాలపై హరితపన్నును భారీగా పెంచేసింది. సాధ్యమైనంత డబ్బును కోట్లలో పిండుకునేందుకు 2022 జనవరి 1 నుంచి హరితపన్ను పెంపును అమలుచేసింది. అప్పటిదాకా రూ.200 ఉన్న పన్నును వివిధ శ్లాబ్‌లుగా విడదీసేసింది. వాహనం కొనుగోలు చేసిన తేదీ నుంచి ఏడు నుంచి పదేళ్లు అయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు పది నుంచి పన్నెండేళ్లదాటితే ఒక త్రైమాసికం పన్ను విలువ, 12ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రవాణా, రవాణాయేతర వాహనాలపై భారీగా పన్ను భారం పడింది. పెరిగిన పన్ను భారం భరించలేక వాహనదారులంతా ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్నును తగ్గిస్తూ ఆదేశాలు జారీచేశారు. దీంతో ఆటోవాలాలకు భారీగా పన్ను భారం తప్పింది.

ఈశా ఆధ్వర్యంలో ప్రారంభమైన యోగా తరగతులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ రామకృష్ణారావుపేటలో ఉన్న గాంధీభవన్‌లో బుధవారం తొలిరోజు ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సద్గురు జగ్గీవాసుదేవ్ కోయంబత్తూరు నుంచి ప్రత్యక్ష ప్రచారం ద్వారా యోగాసనాలు వేసి చూపించారు. ప్రత్యక్ష ప్రసారం చూస్తూ శిక్షణకు వచ్చిన అభ్యర్థులు యోగాసనాలు వేశారు. ఈ తరగతులు ఈనెల 16 వరకు కొనసాగుతాయి. కార్యక్రమంలో కాకినాడ సెంటర్ కోఆర్డినేటర్ సాగర్, ఇతర వలంటీర్లు బృందం పాల్గొన్నారు.

పంట నష్టం.. లెక్క తేల్చారు

» జిల్లాలో 21.5 హెక్టార్లలో నష్టం

» కలెక్టర్‌కు నివేదిక

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గతనెలలో కురిసిన భారీవర్షాలకు జిల్లాలో అనేకప్రాంతాల్లో వరిపంటలు ముంపునకు గురయ్యాయి. ఈనేపథ్యంలో పదిరోజులుగా వ్యవసాయ అధికారులు,ఎంపీడీవోలు,పోలీసు, రెవెన్యూ అధికారులు పంటనష్టం గణనచేశారు. ప్రధానంగా కిర్లంపూడి, తాళ్లరేవు మండలాల్లో 77 మంది రైతులకు చెందిన 21.5హెక్టార్లలో వరి పంటకు నష్టం కలిగిందని లెక్క తేల్చారు. దీని విలువ రూ.5.39లక్షలుగా పేర్కొన్నారు. రైతులకు పరిహారం ఇచ్చే నిమిత్తం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ వెల్లడించారు. ఈ ప్రతిపాదనను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు ఆయన పంపించారు. అనంతరం ఈ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు.



గుడ్డు.. బ్యాడ్డు..

» గుడ్డు ధర దోబూచులాట

» మొన్నటి వరకు బాగున్నా.. తాజాగా పతనం

» రైతు ధర రూ.5.45.. చేతికి దక్కేది ఐదే

» మరోవైపు పడిపోయిన దిగుబడులు

» బహిరంగ మార్కెట్‌లో మాత్రం ధర రూ.7

అనపర్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కోడిగుడ్లకు మంచి ధర పలకడంతో పౌల్ట్రీ రైతులు ఎంతో ఆనందపడ్డారు. అయితే ఈ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. కొద్దిరోజులుగా రైతుకు దక్కే గుడ్డు ధర అంతకంతకూ దిగజారిపోతోంది. ప్రస్తుతం గుడ్డు ధర పేపర్ రేటు ప్రకారం రూ.5.45కు పడిపోయింది. ఇది కూడా రైతుకు పూర్తిగా దక్కడం లేదు. ఈ ధరలో ఏజంటు కమిషన్ రూ.0.25 పైసలు పోతుంది. అంతేగాకుండా ట్రేడర్లు నిర్ణయించిన కమింగ్ రేటు ప్రకారమే ఇప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయి. దాంతో రైతు చేతికి రూ.5 మాత్రమే దక్కుతోంది. ఈ ధర ఎంతమాత్రం గిట్టుబాటు కాదని పౌల్ట్రీ రైతులు ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి కోళ్లకు ఇటీవల పలు రకాల తెగుళ్లు రావడంతో కోళ్ల సంఖ్య పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1.30 కోట్ల కోళ్లు ఉండగా, వీటి సంఖ్య 90 లక్షల వరకు పడిపోయింది. దీంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అయ్యే గుడ్లు ప్రస్తుతం 65 లక్షల నుంచి 70 లక్షలకు పడిపోయాయి. మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఎదురై కోళ్లు చనిపోవడంతో గుడ్లకు గిరాకీ పెరిగి గుడ్డు ధర రూ.5.90 వరకు ఎగబాకింది. అయితే గత పది రోజులుగా గుడ్డు ధర పడిపోవడం ప్రారంభించి ప్రస్తుత ధర రూ.5.45పైసలుగా ఉంది. ఉత్పత్తి తగ్గినా గుడ్డు ధర ఆశాజనకంగా ఉందని రైతులు సంబరపడినంత సమయం కూడా లేకుండా పతనం దిశగా పయనిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలకాలంలో ఒడిసా సహా ఇతర రాష్ట్రాల్లో పౌల్ట్రీల సంఖ్య పెరగడంతో ట్రేడర్లు కూడా మన గోదావరి ప్రాంత ఎగుమతులపై ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం కమింగ్ ధరకే ప్యాకేజీలు జరుగుతుండడంతో పేపర్ ధర రూ.5.45 ఉన్నప్పటికీ ఏజంటు కమిషన్ 0.25 పైసల భారం ఎలాగూ రైతుపైనే పడుతోంది. అంతేకాకుండా అక్కడి ట్రేడర్లు నిర్ణయించిన ధరనే కమింగ్ రేటుగా పరిగణించడంతో ప్రస్తుతం రైతు చేతికి రూ.5.00 మాత్రమే చేరుతోంది. ప్రస్తుతం కొత్త బ్యాచ్‌లు వేయడంతో అవి గుడ్డు పెట్టే దశకు చేరుకునేందుకు మరో నాలుగైదు నెలల సమయం పడుతుందని, అప్పటివరకు ఇదే పరిస్థితి కొనసాగితే తాము నష్టాల బారిన పడతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఫీడ్ ధరలో పెద్దగా మార్పు లేకపోవడంతో టన్నుకు రూ.30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని, గుడ్లు ఉత్పత్తి పెరిగే వరకు రూ.6.00 పైబడి ధర పలికితే గాని తాము కోలుకోలేమని రైతులు అంటున్నారు. వచ్చే శీతాకాలంపైనే ఆశలు పెట్టుకున్నామని, అప్పటికైనా ధర పెరిగితే నష్టాలు తగ్గుతాయని చెబుతున్నారు.

మార్కెట్‌లో ఇష్టారాజ్యం

వినియోగదారుల కోణంలో చూస్తే కోడిగుడ్ల ధరలు ఆకాశాన్నంటాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.6.50 ఉండగా, రిటైల్ మార్కెట్‌లో రూ.7 నుంచి ఏడున్నర వరకు విక్రయాలు సాగుతున్నాయి. దాంతో చాలా దారుణంగా కోడిగుడ్ల ధరలు పెరిగిపోయాయని సామాన్యులు గగ్గోలుపెడుతున్నారు. పౌష్టికాహారం కోసం ఎక్కువగా గుడ్లనే వినియోగిస్తున్నందున అధిక భారం పడుతోందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం రైతు వద్ద ధరలు తగ్గుతుండడంతో అటు హోల్‌సేల్‌లోనూ, ఇటు రిటైల్‌లోనూ ధరలు తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి మాత్రం రిటైల్‌లో ఏడు రూపాయల ధరలోనే విక్రయాలు సాగుతుండడం గమనార్హం.

కోళ్ల పరిశ్రమకు పూర్వవైభవం చంద్రబాబు చేతుల్లోనే ఉంది



రాష్ట్రంలో ఏ పరిశ్రమ ఎలా ఉంది, ఎవరికి ఎటువంటి సహాయ సహకారాలు అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి తెలిసిన విధంగా మరే ముఖ్యమంత్రికి తెలియదనడంలో అతిశయోక్తి లేదు. 2014లో ఆయన ముఖ్యమంత్రి అయ్యే నాటికి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఒడిదుడుకులను తెలుసుకుని అనేక రాయితీలు కల్పించారు. ప్రస్తుతం పరిశ్రమ అప్పటికన్నా మరింత సంక్షోభంలో ఉంది. ప్రభుత్వపెద్దలు కోళ్ల పరిశ్రమపై దృష్టి సారించి పరిశ్రమను ఆదుకుంటారని రైతులంతా ఎదురు చూస్తున్నారు. **- పడాల సుబ్బారెడ్డి, రాష్ట్ర కోళ్ల రైతుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి**

ఆక్వా జోన్ పరిధిలోకి ఆక్వా చెరువులు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హతఉన్న ఆక్వా చెరువులన్నీ ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం ఆయన మత్స్యశాఖ అధికారులతో ఆక్వా చెరువుల అనుమతులకు అనుసరిస్తున్న విధానాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23వేల ఎకరాల ఆక్వా చెరువులు విస్తరించి ఉండగా ఇప్పటివరకు 16వేల ఎకరాల్లో చెరువులను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకొచ్చామన్నారు. మిగిలిన వాటిని కూడా ఆక్వాజోన్ పరిధి కిందకు తీసుకురావడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకురావడంవల్ల రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీలను రైతులు పొందే అవకాశం ఉందన్నారు. గతంలో ఆక్వా జోన్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్లను ఎల్పీఎం కింద మారిపోవడంతో రైతులకు ఆక్వా అనుమతులు మంజూరులో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి సర్వే, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. ఆయా వివరాలను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు, మత్స్యశాఖ ఏడీలు లావణ్య, కరుణాకర్, డీవోలు నూకరాజు, అనురాధ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15న కలెక్టర్ల కాన్ఫరెన్స్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న అమరావతిలో సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఈ కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారు. ఇందులో ప్రధానంగా ఆర్‌టీజీఎస్, పీ4 బంగారు కుటుంబాలు, సూపర్‌సిక్స్ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. జిల్లాలో పెండింగ్ పనులు, అభివృద్ధి పనుల పురోగతిపై చర్చిస్తారు. ఈ కాన్ఫరెన్స్ రెండురోజులపాటు జరిగే అవకాశాలు ఉన్నాయి.

నిధులు 'పుష్కలం'

» పుష్కర ఎత్తిపోతల పథకానికి నిధుల జల్లు

» పైపులైన్ల మార్పునకు రూ.51.67కోట్లు విడుదల

» ఎట్టకేలకు ఉత్తర్వులు జారీ చేసిన జలవనరులశాఖ

» 31వేల ఎకరాల ఆయకట్టుకు ఊపిరిలూదిన సీఎం చంద్రబాబు



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

పుష్కర ఎత్తిపోతల పథకానికి ఎట్టకేలకు మంచిరోజులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్లకాలంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు జీవం పోశారు. కీలక పైపులకు మరమ్మతులు లేక అస్తవ్యస్తంగా మారిన ఎత్తిపోతల పథకానికి నిధుల జల్లు కురిపించారు. దీంతో రూ.51.67కోట్ల నిధులు మంజూరు చేస్తూ జలవనరులశాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మెట్టప్రాంతానికి అత్యంత కీలకంగా మారి 31వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించే ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా గత వైసీపీ సర్కారు అన్నదాతలను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. పైపులకు మరమ్మతులు చేయాలంటూ అనేకసార్లు అప్పటి మాజీ ఎమ్మెల్యే అధికారుల చుట్టూ తిరిగినా కనీసం పట్టించుకోలేదు. చివరకు రైతులతో కలిసి ఒత్తిడి తెస్తే కేవలం రూ.25లక్షలు మంజూరు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం మారిన తర్వాత ఎమ్మెల్యే నెహ్రూ సీఎం చంద్రబాబును కలిసి ప్రాజెక్టు దుస్థితిని వివరించారు. గతంలో ప్రాజెక్టు చంద్రబాబు చేతుల మీదుగా పురుడుపోసుకున్న వైనాన్ని వివరించి నిధుల మంజూరుకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో గతనెల 21న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు జలకళ తీసుకురావాలని నిర్ణయించారు. మరమ్మతులకు గురైన పైపులను మార్చాలన్న ఇంజనీర్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర తెలిపారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ తీర్మానం నేపథ్యంలో మరమ్మతులకు రూ.51.67కోట్లు మంజూరు చేస్తూ జలవనరుల శాఖ జీవోఆర్టీ నెంబరు 459జారీ చేసింది. దీంతో మరమ్మతులు పూర్తయితే 31వేల ఎకరాల ఆయకట్టుకు తిరిగి నీరు అందనుంది.

ఆరంభంలోనే పైపులు మార్చేశారు..

జగ్గంపేట నియోజకవర్గంలోని గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద నిర్మించిన పుష్కర ఎత్తిపోతల పథకం ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు గురైంది. దీనికి శంకుస్థాపననుంచి టెండర్లు పిలిచి పనులు ప్రారంభం వరకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలోనే జరిగింది. తీరా వైఎస్ సీఎం అయిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారు. సాగునీరు ప్రవహించడానికి ఇనుప పైపులు బదులు సిమెంట్ పైపులు వినియోగించారు. దీంతో కాలక్రమేణా సిమెంట్ పైపులపై ఒత్తిడి పెరిగి ఎందుకు పనికిరాకుండా పోయాయి. గత వైసీపీ హయాంలో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దాదాపు 14సార్లు సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. చంద్రబాబు మానసపుత్రిక లాంటి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ప్రయత్నాలు ఫలించి ఎట్టకేలకు నిధులు విడుదలయ్యాయి. వీటితో త్వరలోనే ప్రధాన కాలువకు సంబంధించి 45.195 కిలోమీటరు వద్ద పీఎస్‌సీ ప్రెజర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెజర్ మెయిన్‌తో మార్చే పనికి టెండర్లను ఆహ్వానించనున్నారు. పగిలిపోయి ఎందుకూ పనికిరాని సిమెంట్ పైపుల స్థానంలో ఇనుపపైపులు అమర్చనున్నారు. చివరి ఆయకట్టుకు నీరందేలా పంపింగ్ సామర్థ్యాన్ని కూడా మెరుగుపర్చనున్నారు.

అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు

సమీక్ష సమావేశంలో పీడీ ప్రియంవద

కార్పొరేషన్(కాకినాడ),సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)పథక సంచాలకురాలు ప్రియంవద మెప్మా జిల్లా కార్యాలయంలో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు చెందిన సీటీ మిషన్ మేనేజర్లు కమ్యూనిటీ ఆర్గనైజర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మెప్మా ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై చర్చించారు. బ్యాంక్ లింకేజ్, సూర్యఘర్, స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) సభ్యుల జీవనోపాధి అభివృద్ధి, తృప్తి క్యాంటీన్ల ఏర్పాటు, ర్యాపిడో వంటి పథకాల అమలపై సమీక్షించారు. మిషన్ డైరెక్టర్ మెప్మా నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తిచేయాలని అధికారులకు ఆమె ఆదేశాలు జారీచేశారు. కార్యాచరణలో అలసత్వం వహిస్తే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, సంఘాల ఆడిట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సీఎం ఆలోచనలతో ఏకతాటిపై, ప్రతి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు జీవనోపాధి మెరుగుపర్చుకుని లక్షాధికారి అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

నేవీ రోడ్డు పరిశీలన

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలంలో వాకలపూడి లైట్‌హౌస్ దగ్గర నుంచి నేమాం మీదుగా రూ.11కోట్లతో నిర్మిస్తున్న నేవీ రోడ్డు నిర్మాణాలను కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం పరిశీలించారు. ఇండియన్ నేవీ అధికారుల పర్యవేక్షణలో నిర్మిస్తున్న ఈ రోడ్డు పనులు పూర్తయిన తర్వాత బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు చేస్తున్నారు.





- పంట మార్పిడి విధానంతో తామరపువ్వుల సాగు
- అరవిరిసిన పుష్పాలతో రైతులకు లక్ష్మీ కటాక్షం
- దైవ కార్యాలకే కాదు.. ఆయుర్వేద వైద్యానికి కూడా
- మార్కెట్‌లో భలే డిమాండ్

తామర పూలే... వికసించెనే!

'కలువకు చంద్రుడు ఎంతో దూరం.. కమలానికి సూర్యుడు మరీ దూరం. దూరమైన కొలదీ పెరుగును అనురాగం' అని ఆచార్య ఆత్రేయ అన్నట్టుగానే సూర్యోదయం అవుతుందంటే చాలు పురివిప్పిన నెమలి నాట్యమాడుతున్నట్టుగా చెరువులు, చేలల్లోని కమలాలు విచ్చుకుంటూ మనసుకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. భారతదేశ జాతీయ పుష్పం తామరపువ్వే. ఈ పువ్వును కమలం, పద్మం, అరవిందం, జలజం, అంబుజం వంటి ఎన్నో పేర్లతో పిలుస్తారు. తామరపువ్వులు ప్రధానంగా పూజలు, వ్రతాలు, యజ్ఞ యాగాది క్రతువులకు వినియోగిస్తుంటారు. తామర పువ్వుల్లోని ఔషధ గుణాలను గుర్తించి నేడు ప్రకృతి వైద్య విధానంలో వినియోగిస్తున్నారు. అంతేకాదు. ఆయుర్వేద మందుల తయారీకి తామరపువ్వులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

అటువంటి తామర పువ్వులను వరి పొలాల్లో పంట మార్పిడి విధానంగా సాగులోకి తీసుకువచ్చారు కడియం గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు. ఈయన తన స్వగ్రామంతో పాటు అమలాపురం రూరల్ మండలం జనుపల్లిలో పంటమార్పిడి విధానంలో తామర పువ్వులు పండిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. తనతో పాటు మరో 17 మంది ఇదే తరహాలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పొలాలను లీజుకు తీసుకుని తామర పువ్వులు సాగు చేస్తూ లాభాల పంట పండిస్తున్నట్టు చెప్పారు.

బురదలో పుట్టినా దేవుని పాదాల చెంతకే...

తామర పువ్వులు మనిషికి ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయి. బురదలో పుట్టినప్పటికీ ఎటువంటి మలినాలు అంటకుండా దేవుని పాదపద్మాల చెంతకు చేరుకుంటున్నాయి. మనిషి ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ చెడు ప్రభావానికి లోను కాకూడదు. తామరపువ్వులను ప్రధానంగా లక్ష్మీపూజతో పాటు అమ్మవారి పూజలకు విశేషంగా వినియోగిస్తారు. విష్ణుపూజతో పాటు యజ్ఞ యాగాది క్రతువుల్లోనూ వినియోగిస్తారు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులు, కార్తీక మాసంలో వీటిని విరివిగా వినియోగిస్తారు. ఈ పువ్వులను లక్ష్మీ స్వరూపంగా భావిస్తారు. ఎవరి ఇంటైనా వ్రతం జరుగుతుంటే ముందుగా వీటినే సిద్ధం చేసుకుంటారు.

ఆరోగ్య ప్రదాయినిగా....

ఆయుర్వేద వైద్యంలో తామర పువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. తామర పువ్వుల రేకలు, కాడలను గుండె జబ్బుల నివారణతో పాటు కామెర్లు, అతిసార వ్యాధి నివారణకు వినియోగిస్తారు. తామరపూల రసం రక్తస్రావాన్ని తగ్గించడంతో పాటు మూల వ్యాధి, దగ్గు నివారణకు, చర్మవ్యాధులు, కుష్టు వ్యాధి నివారణకు వినియోగించే మందుల తయారీలో వినియోగిస్తారు. తామర పువ్వుల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు తామరపువ్వుల టీ తాగితే ఉపశమనం పొందవచ్చు. తలనొప్పి, జ్వరానికి కూడా మందుగా పని చేస్తుంది. తామర పువ్వుల టీ తాగితే కార్డియాక్ అరెస్టు వంటి గుండె సంబంధిత సమస్యలు తగ్గుతాయి. తీవ్రమైన ఒత్తిడి ఆందోళనకు గురయ్యే వారికి దివ్య ఔషధమని ఆయుర్వేద నిపుణులు చెప్తున్నారు. పంట మార్పిడి విధానంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. దాంతో భక్తులకే కాదు వైద్య రంగానికి కూడా ఎంతో అవసరమైన తామరపువ్వుల సాగును రైతులు ఇప్పుడిప్పుడే ఎంచుకున్నారు. భద్రాచలం నుంచి దుంపలు తెచ్చి కడియం నుంచి రాజోలు వరకు మిత్రులతో కలిసి తామరపూల సాగు చేస్తున్నామని తూర్పు గోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు తెలిపాడు. కొందరు పశ్చిమ గోదావరి జిల్లాలో సాగు చేస్తున్నారన్నారు. ఎకరాకు రూ.25వేలు చొప్పున పెట్టుబడి పెడుతున్నాం. ఏటా ఆగస్టు నుంచి డిసెంబరు వరకు తామరపువ్వులకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇక ఆయుర్వేద వైద్యం కోసం మరికొందరు ఈ పూల కోసం వస్తున్నారని వీరబాబు తెలిపాడు. మేజర్ డ్రెయిన్ల వెంబడి తొలకరి సాగు ముంపునకు ప్రాంతాలనే ఎంపిక చేసుకుంటున్నాం. ఆయా ప్రాంతాల్లో పొలాలను లీజుకు తీసుకుని తామర సాగు చేస్తున్నాం.




దసరా, కార్తీక మాసాల్లో మంచి డిమాండ్

వాసంశెట్టి వీరబాబు, కడియం



దేవి శరన్నవరాత్రులతో పాటు కార్తీక మాసంలో తామరపువ్వులకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం జనుపల్లి పేరాయిపేటలో డాక్టర్ గొలకోటి రంగారావుకు చెందిన పొలంతో పాటు ఆరు ఎకరాల్లో తామర సాగు చేస్తున్నాం. రబీ సీజన్‌లో యథావిధిగా వరిసాగు చేస్తాం. ప్రస్తుతం పితృ పక్షం జరుగుతుంది. ఈ పక్షం రోజులు అంతగా అమ్మకాలు ఉండవు. అన్ సీజన్‌లో రూ.6కే పువ్వును విక్రయించాల్సి వస్తుంది. సీజన్‌కు అందుబాటులో వచ్చే విధంగా సాగు చేస్తుంటా. ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు లాభం వస్తుంది. రానున్న సీజన్‌లో పొలం వద్దే ఒక్కో పువ్వు రూ.15 నుంచి రూ.18 వరకు విక్రయిస్తాం. పూల వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. యజ్ఞాల కోసం ఒక్కొక్కరు 120 పుష్పాలు చొప్పున తీసుకెళ్తారు. ప్రస్తుతం ఎక్కడచూసినా తామర పువ్వు దొరికితే చాలు అన్న పరిస్థితి ఉంది. అయినా మేము మాత్రం ఎక్కువ రేటు చేసి అమ్మం. ఎందుకంటే అన్ సీజన్‌లో ఎలా ఉంటుందో చూస్తున్నాం.



ఈవీఎంలే కీలకం

- పంచాయతీ ఎన్నికల్లో తప్పనున్న తిప్పలు
- సులభతరం కానున్న కౌంటింగ్

ఆలమూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలంటే అధికారులకు, సిబ్బందికి సవాలే. ఒకే రోజు పోలింగ్, అదే రోజు లెక్కింపు అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక. ఇదంతా జరిగేటప్పటికి కొన్ని గ్రామాల్లో తెల్లవారుతుంది. రాత్రంతా ఎంతో క్లిష్టమైన ఓటింగ్ లెక్కింపు ప్రక్రియ ఉద్యోగులకు పెద్ద సవాల్. రాష్ట్ర ఎన్నికల కమిషనరు స్థానిక పంచాయతీ ఎన్నికలకు ఈవీఎంలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మంగళవారం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇలా సాధ్యం

పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఈవీఎంలతో ఎలా సాధ్యమవుతుందనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. అయితే కౌటింగ్ ప్రక్రియ సులభతరం కానున్న తరుణంలో ఓటింగ్ ప్రక్రియలో మార్పులు తీసుకురానున్నారు.

అదెలా ఉంటే...

పంచాయతీ ఎన్నికలకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమయం ఉంటుంది. తిరిగి రెండు గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది.

ఈవీఎంలతో ఎన్నిక నిర్వహిస్తే ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 లేదా 4 గంటల వరకు పోలింగ్ జరిగేలా ఏర్పాటు చేయనున్నారు. అలా చేయడం వల్ల ఓట్లు పోలింగ్ బూత్‌ల సంఖ్య తగ్గనున్నాయి.

అదెలాగంటే..

ఎలాగంటే మేజర్ పంచాయతీల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండడం వల్ల ఒక్కో వార్డుకు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఇప్పుడు ఈవీఎంలు పెట్టడం వల్ల, ఓటింగ్ పోలింగ్ సమయం పెంచడం వల్ల వార్డుకు అన్ని పంచాయతీలకు ఒక బూత్ పెట్టి, సర్పంచ్‌కు ఒకటి, వార్డు సభ్యునికి ఒక ఈవీఎం ఏర్పాటుచేస్తే సరిపోతుంది.

లెక్కింపు ప్రకియ సులభతరం ఇలా..

ఇప్పటివరకు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ అనంతరం మధ్యాహ్నం రెండు నుంచి కౌంటింగ్ మొదలుపెట్టి ముందుగా బ్యాలెట్లను కట్టలు కటేవారు.

ఆ కట్టలు ఎక్కించిన సరిపోయిన అనంతరం వార్డు సభ్యులు ఓట్లు సర్పంచ్ ఓట్ల వేరు వేరుగా లెక్కింపు చేపట్టడం తలకి మించిన భారంగా మారేంది. అన్నిటికంటే ముఖ్యంగా ఓటు ముద్ర సరిగా పడని బ్యాలెట్లు లెక్కింపు పెద్ద వివాదాస్పదమయ్యేది. ఆ ఓటు తమదంటే తమదని లెక్కింపు ఏజెంట్లు ఘర్షణకు దిగి కొన్ని సమయాల్లో కొట్లాటకు దారితీసేది. ఇలా అన్ని వివాదాలు పరిష్కరించడం, పోలీసు, పంచాయతీ శాఖల అధికారులకు స్టేజ్-2 ఆఫీసర్లకు నానా ఇబ్బందికరంగా ఉండేది.

కానీ ఇప్పుడు అలాంటి సమస్యలు తలెత్తకుండా చిన్న, పెద్ద పంచాయతీ సమస్య లేకుండా ఈవీఎంల ద్వారా ఓట్ల లెక్కింపు ఎంతో సులభతరం కానుంది. ఓట్ల లెక్కింపు అనతరం ఉప సర్పంచ్ ఎన్నికను కూడా ఆ రోజు సాయంత్రానికే పూర్తి చేసే అవకాశం ఉంది.

గతంలో ఓట్ల ఎక్కింపు తెల్లవారుజాము వరకు జరగడం వల్ల ఉప సర్పంచ్ ఎన్నికలు చాలాచోట్ల వాయిదాపడేవి. వాటిని మరో రోజు నిర్వహించడం సమస్యగా మారేది.

2021లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 1050 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 9, 13, 19, 21 తేదీల్లో నాలుగు దశలుగా ఈ ఎన్నికలు నిర్వహించారు. 2020-21 ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఏప్రిల్ 3న వీరంతా పదవీ బాధ్యతలు చేపట్టారు.

నూతన సాంకేతికతపై పట్టుసాధించాలి

- మిషన్ లెర్నింగ్ విప్లవంతో భవిష్యత్‌ను రూపొందించుకోవచ్చు
- ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతపై పట్టుసాధించి గొప్ప ఇంజనీర్లుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. మిషన్ లెర్నింగ్ విప్లవంతో మెకానికల్ ఇంజనీర్లు భవిష్యత్‌ను రూపొందించుకోవచ్చునని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంట్రడక్షన్ టు మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్ ఫర్ ప్రెడిక్షన్ ఆఫ్ ప్రాపర్టీస్ ఆఫ్ మెటీరియల్స్ అనే అంశంపై బుధవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ మనం కొత్తయుగంలో ఉన్నామన్నారు. డేటా ద్వారా నడిచే యుగం అల్గోరిథంల ద్వారా నడిచే శక్తిని పొందుతుందని మన ఊహ ద్వారా మాత్రమే పరిమితం అవుతుందన్నారు. మెటీరియల్ సైన్స్, అర్థశాస్త్రం, వైద్య, సాహిత్యం లేదా కళలు ఏ రంగమైనా మీరంగంలోని క్లిష్టసవాళ్లను పరిష్కరించడానికి మిషన్ లెర్నింగ్ శక్తివంతమైన లెన్స్‌ను అందిస్తుందన్నారు. మిషన్ లెర్నింగ్‌పై పట్టుసాధించాలని, ఇటువంటి వర్క్‌షాప్‌లు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.బి. వీరేశ్‌కుమార్ మాట్లాడుతూ మిషన్ లెర్నింగ్ ప్రాథమికాంశాలు, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం కోర్స్ కోఆర్డినేటర్ కె.శ్రీహర్షరెడ్డి, అధ్యాపకులు బి.లక్ష్మి, కె.దుర్గారావు పాల్గొన్నారు.

రూ. 92.5 కోట్లతో ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ రివైజ్డ్ డీపీఆర్ సిద్ధం



రివైజ్డ్ డీపీఆర్‌ను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి అందజేస్తున్న అధికారులు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా లోని ప్రాచీన మూడు ఆలయాలను ఈస్ట్రన్ చాళుక్యాస్ త్రిమందిర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పర్యాటకశాఖ ద్వారా అభివృద్ధి చేసేందుకు టూరిజం శాఖాధికారులు రూ.92.5కోట్లతో రివైజ్ డీపీఆర్ సిద్ధం చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. రివైజ్ డీపీఆర్‌ను బుధవారం అధికారులు అనపర్తిలో ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయం, శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయం, పెదపూడి మండలంలోని గొల్లల మామిడాడలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాలను అభివృద్ధి చేసేందుకు రూ.88 కోట్లతో డీపీఆర్ తయారు చేశారన్నారు. దీనిపై ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించి మార్పులు చేయాలని సూచించగా మరలా రివైజ్డ్ డీపీఆర్‌ను రూ.92.5 కోట్లతో తయారు చేశారన్నారు. దీనిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. నిధులు మంజూరుకు కృషి చేస్తున్న ఎంపీ పురందేశ్వరి, కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రులకు ఈసదర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

యోగా క్రీడాకారిణి మహిమకు అభినందన



మహిమను సత్కరిస్తున్న యోగా గురువు చిట్టిబాబు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి):ఇటీవల ద్వారకా తిరుమలలో యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 50వ ఏపీ స్టేట్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ -2025 పోటీలలో కాకినాడ నగరానికి చెందిన మేడిశెట్టి మహిమ 30-35 ఏజ్ కేటగిరిలో స్టేట్ సిల్వర్ మెడల్ సాధించి, రాబోయే డిసెంబర్‌లో బీహార్, రాంచిలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆంధ్రప్రదేశ్ యోగా విద్య పీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక మెయిన్ రోడ్‌లోగల రాక్ యోగా స్పోర్ట్స్ అకాడమీలో నేషనల్ యోగాసన కోచ్ డి.ఎస్.ప్రపాద్ ఆధ్వర్యంలో స్టేట్ విన్నర్‌కు బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యోగా గురువు చిట్టిబాబు స్టేట్ సిల్వర్ మెడల్ విన్నర్ మహిమని ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం యోగా కోచ్ డి.ఎస్.ప్రసాద్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, జాతీయ పోటీలలో పాల్గొనే యోగా క్రీడాకారులను ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో యోగా శిక్షకులు కల్పన, భారతి, అర్జునరావు, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

- 3.11లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..

ధవళేశ్వరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ద్వారా 3,11,526 క్యూసెక్కుల మిగులు ప్రవాహన్ని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో గోదావరి నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలద్వారా 14,300క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4900 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2400క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.30 అడుగులుగా నమోదైంది.

టీటీడీ అన్నదాన ట్రస్టుకు రూ.10,10,106 విరాళం



టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడుకు చెక్కు అందజేస్తున్న అనంత శ్రీనివాస్ దంపతులు

గోకవరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం వెదురుపాక మాజీ సర్పంచ్, తంటికొండ దేవస్థానం కమిటీ సభ్యుడు బొట్టా రామకృష్ణ సోదరుడు తలారి అనంత శ్రీనివాస్, తార దంపతుల కుమార్తె హసిత శ్రీఐశ్వర్య పేరుపై బుధవారం టీటీడీకి విరాళం అందజేశారు. టీటీడీ అన్నదాన ట్రస్ట్ నిమిత్తం రూ.10,10,106ల చెక్కును జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడికి శ్రీనివాస్ దంపతులు అందించారు. శ్రీనివాస్, తార కుటుంబ సభ్యులు ప్రస్తుతం రాజమహేంద్రవరంలో నివాసం ఉంటున్నారు.



ఇంటింటికీ తాగునీరు

జలజీవన్ మిషన్ నిధులు రూ.1650 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

- 1647 హేబిటేషన్లలో 2,800 కిలోమీటర్ల మేర పైపులైన్ల ఏర్పాటు
- గోదావరి జలాలను నేరుగా ప్రాజెక్టుకు తరలింపు
- ఉమ్మడి జిల్లాలను ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలుగా విభజన
- పైపులైన్ ఏర్పాటుకు డీఐ పైపుల సిద్ధం


కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరంలో డీఐ పైపులతో ట్రాలీలు

పి.గన్నవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతిఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం జలజీవన్‌మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ముఖ్యఉద్దేశ్యం శివా రు ప్రాంతాల్లోను ఇంటింటికీ తాగునీరు అంది ంచడం. ఈ క్రమంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి జలజీవన్ మిషన్ నిధులు రూ.1650కోట్లతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును రూపకల్పన చేసింది. 30ఏళ్లపాటు తాగునీరు అంది ంచేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ పథకం ద్వారా 2011 జనాభా లెక్కల ప్రకారం 24.92 లక్షల జనాభాకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే కాలంలో మరో పదిలక్షల జనాభా పెరిగినా ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరందించే లక్ష్యంగా చెప్తున్నారు. జలజీవన్‌మిషన్ నిధుల్లో కేంద్రం సగం నిధులిస్తే.. మరో సగం నిధులు రాష్ట్రం మంజూరు చేయాల్సి ఉంది. శివారు ప్రాంతాలకు సైతం వేసవిలోను తాగునీరును పుష్కలంగా అందించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. కాల్వనీరుతో సంబంధం లేకుండా నేరుగా గోదావరి జలాలతో తాగునీరు అందించేందుకు వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును తెరమీదకు తీసుకువచ్చారు. కాల్వనీరు రోజురోజుకు అస్తవ్యస్తంగా తయారై కలుషితం అవుతున్న తరుణంలో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు రావడం శుభపరిణామమే. ఈ పథకం టీడీపీ హ యాంలో తెరమీదకు వచ్చినప్పటికీ అప్పట్లో వైసీ పీ ప్రభుత్వం వచ్చి ముందుకు తీసుకురావడంలో విఫలమైంది. పనులు ప్రారంభించకుండానే టెం డర్లు సైతం రద్దయినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాటర్‌గ్రిడ్ పథ కంపై ప్రత్యేక దృష్టి కనబరిచింది. దీంతో ఇటీవలే ఈ టెండర్‌ను మెగా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. ఇప్పటికే మండలాలవారీగా ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు సర్వే పూర్తి చేయగా సంబంధిత కంపెనీ మళ్లీ సర్వే, డిజైన్‌లు సిద్ధం చేసింది.

బొబ్బర్లంక నుంచి సఖినేటిపల్లి వరకు..

బొబ్బర్లంకలో ప్రారంభమైన పైపులైన్ అమలాపురం కెనాల్ చెంతనే పలివెల వరకు వస్తుంది. అక్కడ నుంచి అవిడి నుంచి విడిపోయిన పైపులైను వయా నరేంద్రపురం మీదుగా పి. గన్నవరం వస్తుంది. అవిడి నుంచి మరో పైపు లైన్ వయా ముక్కామల, గంగలకుర్రు మీదుగా బండారులంక చేరుకుంటుంది. అలాగే పి.గన్న వరం నుంచి ప్రారంభమైన పైపు లైను జగ్గన్న పేట వచ్చి ఒకటి మామిడికుదురు వరకు వెళ్తుం ది. జగన్నపేట నుంచి ప్రారంభమైన మరో పైపు లైను సఖినేటీపల్లి మండలం వరకు చేరుకుంటుంది. అలాగే ఈస్ట్రన్‌డెల్టాలో కూడా రూపొందిన డిజైన్ మేరకు పైపు లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు పైపు లైను ఏర్పాటు నిమిత్తం గ్రామాల్లోకి 5.5 మీటర్లు పొడవు గల డిఐ (డక్టైల్ ఐరన్ పైప్) పైపులు చేరుకుంటున్నాయి. పి.గన్నవరం మండల పరిధిలో పోతవరానికి డీఐ పైపులతో కూడిన ట్రాలీలు అధిక మొత్తంలో చేరుకున్నాయి. పైప్‌లైన్ ఏర్పాటు నిమత్తం ఆర్‌అండ్‌బీ అధికారుల అనుమతులు తీసుకోవల్సి ఉందని పూర్తిస్థాయిలో అనుమతులు సిద్ధం చే సుకుని పనులు ప్రారంభిస్తారని అధికారులు చెప్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 35 మండలాలకు తాగునీరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదటి దశలో 35 మండలాలకు సంబంధించి 1647 హేబిటేషన్లలో 2,800 కిలోమీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. బొబ్బర్లంకలో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రా వాటర్ ఇన్‌టేక్ వెల్ ఏర్పాటు చేసి పైపులు ద్వారా ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్‌లకు పంపిస్తారు. అక్కడి నుంచి మండలాలకు తద్వారా గ్రామాలకు తాగునీరును పంపిస్తారు. కాగా ప్రాజెక్టును ఉమ్మడి తుర్పుగోదావరి జిల్లాల్లో ఈస్ట్రన్, సెంట్రల్ డెల్టాలుగా విభజించి మండలాలు వారీగా తాగునీరు అందించనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబందించి తూర్పుగోదావరి జిల్లాలో కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాలు... కాకినాడ జిల్లాకు సంబంధిం సామర్లకోట, కరప, బిక్కవోలు, పెదపూడి, తాళ్లరేవు, అనపర్తి, కాకినాడ రూరల్ మండలాలు.. కోనసీమ జిల్లాకు సంబంధించి 22 మండలాలలకు మొదటి విడతగా తాగునీరు అందించనున్నారు. ఈస్టన్ డెల్టాకు సంబంధించి కడియం మండలంలో వద్ద ఫిల్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే సెంట్రల్‌డెల్టాకు సంబంధించి ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి 80 కిలోమీటర్లకు 30 నుంచి 40 సెంట్ల స్థలంలో ఒక సంపు, ఒహెచ్ బిఆర్, వాచ్‌మేన్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. ఆ సంపుల నుంచి గొట్టాల ద్వారా వెళ్లిన తాగునీరు గ్రామాల్లో పంపిణీ జరుగుతుంది. గ్రామాల్లో 20 నుంచి 25వేలు జనాభాకు ఒక ట్యాంక్ ఏర్పాటు చేసి తద్వారా తాగునీరు అందించనున్నారు. అదే విధంగా ఇప్పటికే మండలాల్లో కొనసాగుతున్న తాగునీరు ప్రాజెక్టులను యథావిధిగా ఉంచి ఎప్పుడైనా వాటర్‌గ్రిడ్‌కు సంబంధించి పైపులైన్లకు సంకేతిక సమస్య తలెత్తితే ఈ ప్రాజెక్టును తాత్కాలికంగా ఆయా గ్రామాల్లో తాగునీరు కొరత రాకుండా వినియోగించవచ్చని అధికారులు చెప్తున్నారు. కాగా ఫిల్టర్ యూనిట్‌లు, సంపులకు ప్రస్తుతం భూసే కరణ జరుగుతుందని సంబంధిత అధికారులు చెప్తున్నారు. రెండోదశలో మిగిలిన మండలాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా లంకగ్రామాలకు సైతం తాగునీరుందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అన్నవరం దేవస్థానానికి సరఫరా చేసే దినుసుల్లో

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నందాజీ


టెండర్‌దారులతో సమావేశమైన ఈవో, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి అవసరమయ్యే దినుసులు, ఇతర రసవర్గములు సరఫరా చేసే వాటిలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ ఆహారనియంత్రణ అధికారి జీఏబీ నందాజీ హెచ్చరించారు. నూతన టెండర్ ద్వారా ఈఏడాది సెప్టెంబరు 1 నుంచి 2026 మార్చి వరకు ఇటీవల పిలిచిన టెండర్లలో తక్కువధరకు కోడ్ చేసి టెండరు దక్కించుకున్న టెండర్‌దారులతో ఈవో, దేవస్థానం సిబ్బంది, ఆహారనియంత్రణ అధికారులు బుధవారం సమావేశమయ్యారు. తప్పనిసరిగా ఎఫ్ఏఎస్ ఎస్ఐ, అగ్‌మార్క్ సర్టిఫికేషన్ ఉన్న దినుసులనే సరఫరా చేయాలని, అన్ని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని నాణ్యత లేమి సరుకులు సరఫరా చేసి తమ తనిఖీల్లో లోపం కనిపిస్తే వారిపై చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ హెచ్చరించారు. సమావేశంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేశవ దుర్గాప్రసాద్ ఏఈవోలు భాస్కర్, శ్రీని వాస్, అనకాపల్లి ప్రసాద్, పర్వత నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో ఆలయాల ఆదాయం రూ.15.77 లక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 10(ఆంధ్ర జ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ప్రాచీన ఆలయాల హుండీలను బుధవారం లెక్కించగా రూ.15,77,190 ఆదాయం సమకూరినట్టు రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి ఆర్.బాలాజిరామ్‌ప్రసాద్ తెలిపారు. జూలై 17, 2025 నుంచి ఇప్పటివరకూ శ్రీలక్ష్మీ గణపతి ఆలయాల్లో హుండీలను లెక్కించగా రూ.11,80,790..గోలింగేశ్వరస్వామి ఆలయంలో రూ.3,96,400 ఆదాయం సమకూరిందన్నారు.


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

సత్యదేవుడి సన్నిధిలో రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ పూజలు

అన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో దక్షణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఐతే పాండే కుటుంబసభ్యులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా ఈవో మెమెంటో అందజేశారు.


మేనేజర్‌కు మెమెంటో అందజేస్తున్న ఈవో

కొండెవరంలో పేలిన గ్యాస్ బండ

రూ.2 లక్షల ఆస్తి నష్టం


కొండెవరంలో కాలిన తాటాకిల్లు

కొత్తపల్లి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొండెవరంలో మంగళవారం అర్ధరాత్రి గ్యాస్ బండ పేలి భారీ ప్రమాదం జరిగింది. రాయుడు నూకరాజు తాటాకింట్లో అదే గ్రామానికి చెందిన పెంకే సత్తిబాబు కుటుంబసభ్యులతో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో గ్యాస్ వాసనరావడంతో గుర్తించిన సత్తిబాబు కుమారుడు లేచి చూసేసరికి గ్యాస్ బండ నుంచి మంటలు చెలరేగడాన్ని గమనించాడు. అందర్నీ అప్రమత్తం చేయగా పరుగున రోడ్డుకు చేరుకున్నారు. అనంతరం గ్యాస్ బండ పేలడంతో ఇంటి పైకప్పునకు మంటలు వ్యాప్తి చెందాయి. తాటాకిల్లు కాలిపోయింది. ఇంట్లో సామాన్లు కాలిబూడిదయ్యాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఆదేశాలతో బాధిత కుటుంబానికి కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ రూ.25వేల సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ వర్మ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

ఊపిరి పీల్చుకున్న యానాం వాసులు

అదుపులోకి క్లోరిన్‌గ్యాస్ ట్యాంక్


కనకాలపేటలో సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు


యానాం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): యానాం శివారు కనకాలపేటలో ప్రజలకు తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లో మంగళవారం క్లోరిన్ గ్యాస్ ట్యాంక్ లీకైన విషయం విదితమే. బుధవారం పరిస్థితి అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్థానికులతో కలిసి సంఘటనా జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రతి 4 నెలలకు ఒక సారి క్లోరిన్ ట్యాంక్‌ను మార్చే సమయంలో ట్యాంక్‌కి ఉన్న వాచార్ పగిలిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సంఘటన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి ఇంటింటా నీటి సరఫరా నిలిపివేశారు. బుధవారం ఉదయం మంచి నీటిని కాకినాడ ల్యాబ్‌కు పంపి వచ్చిన రిపోర్టు ఆధారంగా సాయంత్రం నుంచి నీటి సరఫరా అందించారు. అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారు డిశ్చార్జ్ అయ్యారు. ఇంటింటికి యానాం ఆరోగ్యశాఖ సిబ్బంది వెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఆరోగ్య శాఖ శిబిరానికి రావాలని వారు సూచించారు.


మంచి నీటిని సేకరిస్తున్న సిబ్బంది

యువతి అదృశ్యంపై కేసు

ధవళేశ్వరం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధి వీరభద్రరావునగర్ కాలనీ పాత బొమ్మూరుకు చెందిన బెండాడి రాము కుమార్తె శాంతి ప్రియ ధవళేశ్వరం జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఎప్పటిలాగానే ఈనెల 9న తండ్రి రాము కుమార్తెను కళాశాల గేటు వద్ద దించి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కళాశాలలో, స్నేహితులు, బంధువులు ఇంట్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే 9440796586, 94919 99336 లో తెలియజేయాలని సీఐ గణేష్ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు కొత్తూరు గురుకుల కళాశాల విద్యార్థులు



చిన్ని, సంతోష్

అనపర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న అండర్ 19 రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎం.రాజు తెలిపారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన ఎంపికల్లో రాష్ట్రస్థాయి పోటీలకు తమ కళాశాలకు చెందిన సీనియర్ ఎంపీసీ విద్యార్థి జక్కుల సంతోష్, జూనియర్ బైపీసీ విద్యార్థి వై.చిన్ని ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులు, పీడీ సతీష్ రాజును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా సమస్యలపై గళం

- అధికారుల పొంతన లేని వివరణలపై జడ్పీటీసీల అసహనం
- కాకినాడలో ఉమ్మడి జిల్లా జడ్పీ స్థాయి సంఘాల సమావేశం
- హాజరైన ఎమ్మెల్సీలు, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలు, సమస్యలపై జడ్పీటీసీలు గళమెత్తారు. అధికారుల పొంతనలేని వివరణలపై అసహనం వ్యక్తం చేశారు. కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశం జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఆయా సంఘాల చైర్మన్ల అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, కుడుపూడి సూర్యనారాయణ హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని ఆయా అంశాల స్థాయి సంఘాలు సమీక్షించాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు అధి కారు లకు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని జడ్పీచైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధికారులను కోరారు.

పూడికతీత పనులు చేపట్టాలి : జడ్పీటీసీలు

ప్రస్తుత ఖరీఫ్, రానున్న రబీ సీజన్‌లకు కాలు వల ద్వారా నీరు సక్రమంగా పంట పొలాలకు అందేలా చూడాలని, అకాల వర్షాల కారణంగా పంట పొలాలు ముంపునకు గురికాకుండా ఇరిగే షన్ కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ఏడోస్థాయి సంఘం చర్చలో భాగంగా ఇరిగేషన్ కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులు, కొత్తగా ప్రతిపాదిం చిన అంశాలు, ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న ఇరి గేషన్ పనుల పురోగతిపై అధికారులు సంబంధిత వివరించారు. నాల్గోస్థాయి సంఘం చర్చలో విద్య వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి సీజనల్ వ్యా ధుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని సభ్యులు తెలిపారు. అర్బన్ రూరల్ హె ల్త్ మిషన్ కింద అవసరమైన చోట పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలను అందుబాటులోకి తీసుకురావాలని, ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అధికారులు పారా మెడికల్ సిబ్బందిని నియమించాలని వివిధ మండలాల సభ్యులు అధికారులను కోరారు. ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని అమలుచేస్తున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెండో స్థాయి సంఘం చర్చలో గ్రామీణ అభివృద్ధికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల పురోగతిపై చర్చించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, ఉపాధి పనిదినాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు ఇరుపక్కల తుప్పలు తొలగించడం, పశువుల షెడ్ల నిర్మాణంపై సభ్యులు అధికారులను వివరాలు కోరారు. ఐదో స్థాయి సంఘం చర్చలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంది ంచాలని సభ్యులు సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా అందించడం ద్వారా రక్తహీనత సమస్యకు గురికాకుండా చూడాలన్నారు. ఆర్థిక, ప్రణాళిక అంశంపై చర్చలో గ్రామాల్లో సక్రమంగా తాగునీరు, పారి శుధ్య ంపై సూచనలు చేశారు. సంక్షేమ శాఖల చర్చలో వివిధ సంక్షేమ వసతి గృహాల పనితీరున సమీక్షించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూర్చాలని సూచించారు. స్థాయి సంఘాలు చర్చించి సూచించిన అంశాలన్నింటిపై ఉమ్మడి జిల్లాలోని అధికారులు సత్వర చర్యలు చేపట్టి రానున్న సర్వ సభ్య సమావేశంలో పూర్తిస్థాయి సన్నద్ధతతో వివరించాలని జడ్పీ చైర్మన్ కోరారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మూడో స్థాయి సంఘం వ్యసాయ శాఖ చర్చలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ యూ రియా కొరత లేకుండా అధికారులకు సూచిం చారు. మోతాదుకు మించి యూరియా ఉపయో గించడం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడు తున్నారని, ఈ విషయమై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. మరో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ మాట్లాడుతూ అధి కారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు.

అక్షరాంధ్ర ప్రతిజ్ఞ

అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, జిల్లా వయోజన విద్యాశాఖ డీఈ పోశయ్యతో కలిసి ఎమ్మెల్సీలు, సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్షరాంధ్ర వయోజన విద్య పుస్తకాలను ఆవిష్కరించారు. తొలుత రామచంద్రపురం జడ్పీటీసీ ఎం.వెంకటేశ్వరరావు అకాల మృతికి చింతిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఐదో స్థాయి సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణమూర్తి, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, జడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీలు వీర్రాజు, కుడుపూడి, జడ్పీటీసీలు

దొంగలు దొరికారు...

పంచాయతీ కార్యాలయంలో బంధించిన గ్రామస్తులు


గ్రామస్తులకు దొరికిన దొంగలు

రాజానగరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పుగోనగూడెంలో గత కొంతకాలంగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై వడిశలేరు రోడ్డు సమీపంలో విటుల వద్దకు వెళ్లి నగదును దోచుకునేందుకు బ్యాగును బలవంతంగా లాక్కుకుంటున్న సమయంలో మహిళ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వారు వచ్చేసరికి ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. మరో నలుగురు పొలాల్లోకి దూకి పరారయ్యారు. పట్టుబడిన ఇద్దరికి గ్రామస్తులు దేహశుద్ధి చేసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ ఇద్దరిని గ్రామస్తులు ప్రశ్నించగా తమది తాళ్లపూడి గ్రామమని మొత్తం ఆరుగురం వచ్చామని, మిగిలిన నలుగురు తప్పించుకుని పారిపోయారంటూ చెప్పారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు.

జ్వరంతో లాగరాయి మహిళ మృతి


మరణించిన జనని (ఫైల్)


జనని కుమారుడితో ఎమ్మెల్యే దంపతులు

రాజవొమ్మంగి సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో 3నెలలుగా ప్రజలు అనారోగ్యానికి గురై మంచం పట్టిన విషయం తెలిసిందే. దీనిపై మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆ గ్రామాల్లో పర్యటించి ప్రజలు భయపడొద్దని పిలుపునిచ్చారు. బుధవారం ఉదయాన్నే లాగరాయికు చెందిన కొంతం జనని (30) జ్వరంతో మృతిచెందింది. జనని ఆగస్టు 30న లాగరాయి ప్రభుత్వాసుపత్రికి వెళ్లిందని, అయినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో ఏలేశ్వరం ప్రైవేట్ ఆసుపత్రికి ఆపై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఆమె మృతితో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఘటనపై లాగరాయి సర్పంచ్ మిరియాల గన లక్ష్మి మాట్లాడుతూ లాగరాయి ప్రభుత్వాసుపత్రిలో సరైన వైద్యం అందట్లేదని, ప్రజలకు అవగాహన కల్పించడంలో వైద్యసిబ్బంది విఫలమయ్యారన్నారు. అయితే ఏడీఎంహెచ్‌వో డేవిడ్ మాట్లాడుతూ జనని మరణానికి స్క్రబ్ టైఫాస్ పాజిటివ్ కారణమని, ఇది బాగా మురికి కాలువలు ఉండే ప్రాంతంలో మాత్రమే వస్తుందన్నారు. గ్రామాల్లో లక్షణాలు ఉన్నవారి నుంచి శాంపిల్స్ తీసుకుంటావున్నారు. కాగా లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం డీపీవో కార్యాలయ ఏవో సుబ్బారావు తనిఖీ చేశారు.

బాలుడికి అండగా ఎమ్మెల్యే

కొంతం జనని మృతిచెందడంతో ఆమె కుమారుడు సూర్య దీక్షిత్ (7) అనాథ అయ్యాడు. జనని మరణ వార్త తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం లాగరాయిలో ఆమె మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్య దీక్షిత్ విద్యాభ్యసం పూర్తయ్యే వరకు తామే తనని చూసుకుంటామని ఎమ్మెల్యే దంపతులు తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. మిషన్ వాత్సల్య ద్వారా ప్రతి నెల బాలుడికి ఆర్థికసాయం అందేలా చూస్తామని తెలిపారు.

నిబంధనలు పాటించని 14 లారీలపై కేసులు

రౌతులపూడి/తునిరూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బండరాళ్లు, క్వారీ నల్లమెటల్ తరలిస్తూ భద్రత నిబంధనలు పాటించని లారీలపై కత్తిపూడి వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసు కేసులు నమోదు చేశారు. కాకినాడ జిల్లా రౌతులపూడి- తుని మండలం తేటగుంట రహదారిలో అతివేగంగా తిరుగుతున్న 14 లారీలపై కేసులు నమోదు చేసి రూ.85 వేలు జరిమానా విధించారు. ఒక లారీని సీజ్ చేశారు. లారీలు తప్పనిసరిగా భద్రత నియమాలు పాటంచాల్సిందేనని, ఇకపై ప్రతిరోజూ నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించిన అధికారుల బృందం

ఐ.పోలవరం,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యకల్యాణం పచ్చతోరణంగా బాసిల్లుతున్న కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలోని మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కృషితో ఆలయ నిర్మాణానికి రూ.4కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా దేవదాయశాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్పతో కూడిన అధికారుల బృందం బుధవారం వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలించింది. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం, గాలిగోపురం, చండీశ్వరుడు, నవగ్రహ మండపాల నిర్మాణాలను పరిశీలించింది. ఉప స్థపతి తయారుచేసిన ఆలయ పునర్నిర్మాణ ప్లానును రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప పరిశీలించి సూచనలు చేశారు. డీఈఈ, ఉప స్థపతి, సహాయ స్థపతి, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ భవానీ కాస్టింగ్ ఎదురుగా గల దుర్గాదేవి ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు బుధవారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం నిర్వహించారు. మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెంకటరమణ, సందీప్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశం ఖరీదు నిండు జీవితం

మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వరప్రసాద్

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో తీసుకునే నిర్ణయంతో నిండు జీవితాన్ని కోల్పోతామని, తద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా చిన్నాభిన్నమవుతుందని కాకినాడ జీజీహెచ్ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినాన్ని పురస్కరించుకుని జీజీహెచ్ ప్రాంగణంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ పనిలో ఒత్తిడి, ప్రేమ విఫలం కావడం, ఎగ్జామ్స్‌లో తక్కువ మార్కులు వస్తే తల్లిదండ్రులు మందలించారని, భార్యాభర్తల మధ్య విభేదాలు తదితర చిన్నచిన్న కారణాలతో క్షణికావేశానికి లోనై ఆత్మహత్యకు పాల్పడడాన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. యువత ఎవరితోనూ మాట్లాడక పోయినా, ఒంటరిగా ఉన్నా అటువంటి వారిని గమనిస్తూ వారు ఆ ఒత్తిడి నుంచి తేరుకునేలా చేసి సైకియాట్రీ వైద్యునితో కౌన్సిలింగ్ ఇప్పించడం, సంబంధిత మందులను వాడడం ద్వారా డిప్రెషన్ నుంచి పూర్తిగా బయటపడతారన్నారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ మానసిక ఆరోగ్య సమస్యలపై, ఆత్మహత్యకు గల కారణాలపై, సమస్యల గుర్తింపు, సమయానుకూలంగా బాధితునికి అవసరమైన మద్దతు ఎలా అందించాలో స్పష్టంగా వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సూరంపేట పాఠశాలకు రూ.లక్షతో సౌకర్యాలు

సమకూర్చిన కరూర్ వైశ్యా బ్యాంకు

ఫర్నిచర్, ఇతర సామాగ్రి అందజేత

గొల్లప్రోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు సీతారామరాజు సొంత నిధులతో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మించడంతో ప్రాచుర్యం పొందిన గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కరూర్ వైశ్యాబ్యాంకు తరపున ఫర్నిచర్, సామగ్రి, ఇతర సౌకర్యాలను సమకూర్చింది. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఫ్యాన్లు, త్రీరేక్ టేబుల్, కుర్చీలు, విజిటర్ చైర్లు, హాట్ అండ్ కోల్డ్ వాటర్ ఫిల్టర్‌లను బ్యాంకు విశాఖపట్టణం డివిజనల్ ఆఫీస్ ఏజీఎం మురళీకృష్ణ అందజేశారు. ఇప్పటికే పాఠశాలకు, చుట్టూ ఉన్న కాలువకు రక్షణ ఫెన్సింగ్‌తో పాటు, గ్రీనరీకి అవసరమైన మొక్కలు ఇతర సదుపాయాలు కల్పించారు. పాఠశాల విద్యార్థుల కోసం ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న అనిసెట్టి సీతారామరాజు చేస్తున్న కృషిని వారు అభినందించారు. కార్యక్రమంలో బ్యాంకు పిఠాపురం బ్రాంచ్ మేనేజరు రమేష్, డివిజనల్ కో-ఆర్డినేటర్ శంకర్, బీడీఎం గోపాలకృష్ణ, హెచ్ఎం అనిసెట్టి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఫర్నిచర్, ఫ్యాన్లు, వాటర్ ఫిల్టర్‌లను ఉపాధ్యాయుడు సీతారామరాజుకి అందజేస్తున్న కరూర్ వైశ్యా బ్యాంకు ఏజీఎం మురళీకృష్ణ

పీఆర్సీ ప్రకటించి ఐఆర్ మంజూరు చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జగన్నాథం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలోనే పీఆర్సీ ప్రకటించి ఐఆర్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎం.జగన్నాథం కోరారు. బుధవారం జరిగిన సంఘ జిల్లా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థిక సంబంధమైన అంశాలను త్వరలోనే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, పీఆర్సీ, డీఏ, ఇతర సమస్యలపై చర్చించారు. జిల్లా కార్యదర్శి జె.రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు రత్నరాజు, జిల్లా సభ్యులు, ఏడు తాలూకా యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

పెద్దాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చదలాడ గ్రామానికి చెందిన మణికంఠ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి కుటుంబానికి జనసేన తరపున రూ.5లక్షల బీమా చెక్కును గ్రామ క్రియాశీల వలంటీరు అందజేశారు. జనసేన ఉభయ గోదావరి జిల్లాల ఎలక్షన్ కో-కన్వీనర్ కొప్పిరెడ్డి నాగబాబు, జనసేన పెద్దాపురం మండల అధ్యక్షుడు దాసు శివబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదిరెడ్డి చంద్రశేఖర్, నీటి సంఘం ఉపాధ్యక్షుడు జట్ల విజయబాబు, వెన్న వెంకటేష్, జట్ల రాంబాబు, బాబ్జీరావ్, చదలాడ గ్రామ ప్రెసిడెంట్ అత్తిలి నాగబాబు, అడ్డూరి భాస్కర్, ద్వారంపూడి చల్లారావు, సొసైటీ డైరెక్టర్ గోపు వల్లయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలో చిక్కం విషమూర్తి, తూరంగికి చెందిన గురల్లి సరస్వతి, పాలెపు మహేష్‌వర్మ కుటుంబసభ్యులకు జనసేన ప్రమాద బీమా నుంచి రూ.5 లక్షల చొప్పున మొత్తాలు మంజూరయ్యాయి. బుధవారం వాటిని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత పవన్‌కే దక్కిందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాటి కాయల వీరబాబు, నాయకులు తాటికాయల వీరబాబు, తురగా సంతోష్, కాకరపల్లి చలపతిరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో యూసీయూకే విద్యార్థికి 2 స్వర్ణాలు

జేఎన్టీయూకే, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని యూసీఈకేలో కెమికల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న షేక్‌అమాన్ అబ్దుల్ రజాక్ తైక్వాండోలో ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు సాధించినట్టు విశ్వవిద్యాలయ స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ తెలిపారు. చెన్నైలో జరిగిన సౌత్‌వెస్ట్ తైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పురుషుల 85 కిలోల విభాగంలో స్పారింగ్, టూల్స్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్.... రజాక్‌ను తన చాంబర్లో అభినందించారు. కోచ్ కాకి శ్రీనివాసరావు మార్గదర్శకత్వం, యూనివర్శిటీ అందించిన సహకారం వల్లే తాను పతకాలు సాధించానని రజాక్ చెప్పాడు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో భారత్ తరపున ఆడటమే తన లక్ష్యమన్నారు.



రజాక్‌ను అభినందిస్తున్న జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్

దేవాలయ పాలకమండళ్ల ప్రమాణస్వీకారం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా వాసిరెడ్డి సత్యకుమార్, సభ్యులుగా నీలకాయల సన్నికిరణ్, సాదే సత్తిబాబు, అనకాపల్లి సత్యవేణి, మజ్జి లక్ష్మి రుక్మిణి, నమ్మి సత్యవాణి, గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ, అందనాపల్లి దుర్గామణి, పొనుగుపాటి చినసుబ్బారావు ప్రమాణం చేశారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా కూటమి నాయకులు మల్లిపూడి వీరు, పైడా కృష్ణమోహన్, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, జొన్నాడ వెంకటరమణ, కవికొండల భీమశంకర్, తలాటం సత్య, వీవీ స్వామి, ఆలయ ఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

సంతచెరువు సమీపంలోని శ్రీగోవిందమాంబ సమేత పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, కామాక్షి అమ్మవారి ఆలయ పాలక మండలి బుధవారం బాధ్యతలు చేపట్టింది. గౌరవ అధ్యక్షులుగా అనుపోజు సత్తిబాబు, చేంబోలు కృష్ణ, చైర్మన్‌గా ముక్కామల త్రిమూర్తులు, వైస్ చైర్మన్‌గా గోపాలవరపు రాజు, ప్రధాన కార్యదర్శిగా తేలాసుల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా లక్కోజు బుజ్జి, లంక శ్రీను, కోశాధికారిగా నరవ వెంకట వీరభద్రాచారి, సహాయ కోశాధికారిగా నరవ వెంకట నారాయణమూర్తి, గౌరవ సభ్యులుగా చెల్లూరి సత్యనారాయణ, ఆవుపాటి నూకరాజు, పొన్నాడ రమేష్, అనుపోజు ఏసు, వాడపల్లి వెంకటసత్యనారాయణమూర్తి, గెడ్డం రమణ, సతీష్‌కుమార్ ప్రమాణం చేశారు.

డ్రైనేజీ భూములకు రేపు జాయింట్ సర్వే

తాళ్లరేవు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుంకరపాలెంలోని సర్వే నెం.123, 125 డ్రైనేజీ భూములకు జాయింట్ సర్వే చేయాలని మండల సమన్వయ కమిటీ చైర్మన్, మెజిస్ట్రేట్ పితాని త్రినాథరావు కోరారు. బుధవారం ఆయన తాళ్లరేవు తహసీల్దారు కార్యాలయంలో సుంకరపాలెం భూ వివాదంపై సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, గ్రామస్తులతో చర్చించారు. ఈ నెల 12న ఆ భూముల్లో జాయింట్ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని సర్వేయరును కోరారు. అంతవరకు ఆ భూముల్లో ఎటువంటి నిర్మాణాలూ చేయరాదన్నారు. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు సూరిబాబు, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, పిల్లి సత్తిబాబు, మోపూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ గుత్తుల శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

'క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి'

కాకినాడ క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కాకినాడ మూడవ అదనపు జిల్లా జడ్జి జి.ఆనంది కోరారు. కాకినాడ కోర్టు ప్రాంగణంలో రూ.3లక్షలతో నిర్మించిన క్రికెట్ ఆస్ట్రో టర్ఫ్ ప్రాక్టీస్ నెట్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. ఆరవ జిల్లా జడ్జి పి.గోవర్ధన్ బౌలింగ్ చేయగా జడ్జి ఆనంది బ్యాటింగ్ చేశారు. సుమారు రూ.70వేలు విలువైన ఆస్ట్రో టర్ఫ్‌ను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ బహూకరించారు. జిల్లాలోని పలువురు న్యాయమూర్తులతో పాటు కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రెండు నెలల పాటు శ్రమించి నెట్‌ను నిర్మించిన స్పోర్ట్స్- కల్చరల్ సెక్రటరీ జోక విజయకుమార్‌ను పలువురు అభినందించారు.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా

బాబీ బాధ్యతల స్వీకారం

సామర్లకోట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో మాధవపట్నం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా కోలా బాబీని బదిలీ చేస్తూ విద్యుత్ ఈఈ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఆయన సామర్లకోట రూరల్ ఏఈ నాగేశ్వరరావుకు ఉత్తర్వు కాపీ అందజేసి విధుల్లో చేరారు.

జనసేన బలోపేతానికి గ్రామ కమిటీలు: జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు



గొల్లప్రోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేనని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో గ్రామానికి ఐదుగురు క్రియాశీల కార్యకర్తలను కమిటీగా ఎంపిక చేస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు తెలిపారు. గొల్లప్రోలులోని వీరభద్ర ఫంక్షన్ హాలులో బుధవారం సాయంత్రం కొడవలి, వన్నెపూడి, చెందుర్తి, తాటిపర్తి, చినజగ్గంపేట గ్రామాలకు చెందిన నాయకులు, జన సైనికులు, వీర మహిళలతో సమావేశాలు నిర్వహించారు. అందరి అభిప్రాయాలు తీసుకుని కమిటీ సభ్యులను నియమిస్తామని చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే ఫేక్ పార్టీ అసత్య విన్యాసాలు

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ధ్వజం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉనికి కోసమే ఫేక్ పార్టీ అసత్య విన్యాసాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని, అసలు రైతుల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి ఉందా అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రశ్నించారు. పంట కాలువల్లో పూడిక తీయని, పొలంలో అడుగుపెట్టని వైసీపీ నాయకులు నేడు రైతుల సంక్షేమం గురించి డ్రామాలు ఆడటం విచిత్రంగా ఉందన్నారు.

రాష్ట్రంలోని రైతుల కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, వారు గతంలో కంటే అధికంగా ఎరువులు వినియోగిస్తు న్నారని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాకు విడుదల చేశారు.

ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ను పరిశీలించిన కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రోత్సాహంతో ఐటీ ఇంక్యుబేషన్ టవర్‌ని వినియోగంలోకి తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. 'అలంకార ప్రాయంగానే ఐటీ ఇంక్యుబేషన్ టవర్' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు సర్పవరం ఆటోనగర్ సెజ్‌లోని ఐటీ ఇంక్యుబేషన్ టవర్ సముదాయాన్ని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ.రమణారెడ్డి, పలువురు అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ టవర్‌ని సత్వరం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సాంకేతిక, విధానపరమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఏపీఐఐసీ డీజీఎం పద్మజాదేవి, తహశీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు: కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

గొల్లప్రోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, నిల్వలు పుష్కలంగా ఉన్నాయని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో వరుసగా ప్రచురితమైన ఫొటో కథనాలకు కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ స్పందించి పరిస్థితులపై ఆరా తీశారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులతో మాట్లాడారు. కలెక్టర్, జేసీ ఆదేశాల మేరకు ఆర్డీవో గొల్లప్రోలులో పర్యటించి పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా అయిందా లేదా, ఇంకా అవసరముందా తదితర అంశాలను పరిశీలించారు. యూరియా కొరత అనేది లేదని, రైతులు తమ అవసరాలకు సరిపడా మాత్రమే తీసుకువెళ్లాలని సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు సౌజన్య ఉన్నారు.

'కష్టజీవుల నేస్తం కామ్రేడ్ సీతారాం ఏచూరి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కష్ట జీవుల నేస్తం కామ్రేడ్ సీతారాం ఏచూరి అని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. బుధవారం సాయంత్రం కాకినాడ సుందరయ్య భవన్‌లో వర్మ అధ్యక్షతన 'కామ్రేడ్ సీతారాం ఏచూరి-సమ సమాజం ఆలోచన' అంశంపై కవితా సమ్మేళనం నిర్వహించారు. కవులు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, గరికపాటి మాస్టారు, అద్దేపల్లి ప్రభు, వేదుల శ్రీరామశర్మ, వేదుల సోమయాజులు, అద్దేపల్లి జ్యోతి, యడ్ల కుటుంబరావు, తురగా సూర్యారావు, నిట్టల ఇందిర, ఇబ్రహీం, సాధనాల చంటిబాబు.... సీతారాం ఏచూరిని కవితా రూపంలో కొనియాడారు. ఆయన కాకినాడ వాసి కావడం గర్వం గా ఉందన్నారు.

కార్యక్రమానికి సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు స్వాగతం పలకగా నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు వందన సమర్పణ చేశారు. మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, మేడిశెట్టి వెంకటరమణ, సీహెచ్ వేణు, ఎం.నాగలక్ష్మి, కె.దుర్గాభవాని, గనారా, టి.రాణి, జెరాం, సత్యం, బి.ఆంజనేయులు, కామిరెడ్డి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు

ఐదుగురి ఎంపిక

పిఠాపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు పిఠాపురం పట్టణానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలోని వీటీ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా బాలికల 60 కేజీల విభాగంలో కె.హర్షిణి, 64 కేజీల్లో పి.మహాలక్ష్మి, 75 కేజీల్లో ఏఎస్ఎస్ వైష్ణవి, 81 కేజీల విభాగంలో జె.ఐశ్వర్య సూర్యదీపిక, బాలురు 91 కేజీల విభాగంలో ఎస్‌డీ నాగేంద్ర ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున పాల్గొంటారు. క్రీడాకారులు, కోచ్ పి.లక్ష్మణరావులను కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ అభినందించారు.


పీఎం నేషనల్ అప్రంటీస్‌షిప్ మేళా


కాకినాడ రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ వృత్తి విద్యా కోర్సులు పూర్తయిన విద్యార్థులకు కాకినాడ పీఆర్ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ప్రధాన మంత్రి నేషనల్ అప్రంటీస్‌షిప్ మేళాను జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి (డీఐఈవో) ఐ.శారద ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లాలోని జూనియర్ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు హాజరుకాగా 250 మంది అప్రంటీస్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. పీఆర్ కళాశాల సీనియర్ అధ్యాపకులు నిరంజన్‌కుమార్, శివప్రసాద్, జిల్లాలోని వివిధ కళాశాలల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'మా ఊరు వేళంగి'

పుస్తకావిష్కరణ

వేళంగి (కరప), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం 'మా ఊరు వేళంగి' పుస్తకావిష్కరణ సభ జరిగింది. సర్పంచ్ నవిలే నీలిమ అధ్యక్షతన రచయిత, సామాజికవేత్త నవిలే రాజేష్ రాసిన ఈ పుస్తకాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత మెర్ల వీరయ్య చౌదరి, ప్రముఖ వైద్యుడు బొండా వెంకన్నరావు, టీడీపీ సీనియర్ నేత చుండ్రు వెంకన్నరాయచౌదరి తదితరులు ఆవిష్కరించి ఆహూతులకు పుస్తక ప్రతులను అందజేశారు. మాజీ సర్పంచ్ ముత్యాల శ్రీనుబాబు, బొడ్డు భాస్కర్‌రామన్, పాకా రాంబాబు, డాక్టర్ కె.భానుమతి, వెలుగుల లచ్చారావు, శాకా శ్రీను, కుంచే అయ్యన్న, సానా శ్రీను, మేడిశెట్టి పట్టాభి, పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.





శరన్నవరాత్రులకు అంకురార్పణ

జగ్గంపేట, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక పద్మనాభనగర్‌లోని చెరువుగట్టుపై వెలసిన కనకదుర్గ ఆలయం వద్ద శరన్నవరాత్రి మహోత్సవాలకు అంకురార్పణ చేశారు.పందిరి రాట ఏర్పాటుచేశారు. జగ్గంపేట శెట్టిబలిజకాలనీ శ్మశానవాటికలో బోరు, షెడ్డు, మౌలిక వసతుల పనులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మం డలాధ్యక్షుడు మణిబాబు, పట్టణాధ్యక్షుడు పాండ్రంగి రాంబాబు, నియో జకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి శంకుస్థాపన చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

స్మార్ట్‌రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్


మోతుగూడెంలో కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

మోతుగూడెం,సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మోతుగూడెంలోని సచివాలయంలో లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి సీత, వీఆర్వో కట్టా వెంకటేశ్వరరావు వీఆర్ఏ, తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: చింతూరులో స్మార్ట్‌రేషన్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ ... మండలం మొత్తమ్మీద 12,210 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆయా కుటుంబాలందరికీ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుతం 11,629 కార్డులు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన 581 కార్డులు త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు. చింతూరు ఎంపీపీ అమల, ఉప ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు జమాల్‌ఖాన్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి, ఎండీ జహంగీర్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్యరాజు, బీజేపీ సీనియర్ నాయకుడు డీవీఎస్ రమణారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు మడివిరాజు, సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, టీడీపీ నాయకులు ఎస్‌ఏ ఆసిఫ్, ఓబులునేని నర్సింహరావు, కాంగ్రెస్ మండల కార్యదర్శి అహ్మద్ ఆలీ, వీఆర్వో రామచంద్రరావు, సచివాలయ కార్యదర్శి జగన్, తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మండలంలో ప్రారంభించారు. మొత్తం 8,182 మంది లబ్ధిదారులకు కార్డులు ఇవ్వనున్నట్టు తహశీల్దార్ వేణు గోపాల్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ శ్రీరామ్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ బాషిత, వీఆర్వో కాంతమ్మ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కూనవరం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న వరద బాధితులకు బుధవారం నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, కందిపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వై.రామవరంలో అన్నసమారాధన

వై.రామవరం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం వాల్మీకి వీధిలోని రామాలయం వద్ద బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ గుడ్ల హేమమణి, రిటైర్డ్ వీఆర్వో రామలింగం, గొర్లె శివరాం, తదితరులు పాల్గొన్నారు.

గండి పోశమ్మ ఆలయ చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి

దేవీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పూడిపల్లి పంచాయతీ గొందూరు గోదావరి నది ఒడ్డున స్వయంభూగా వెలసిన మాతృశ్రీ గండి పోశమ్మ వారి ఆలయ చైర్మన్‌గా మలుగుల శ్రీనివాస్‌రెడ్డిని నియమించినట్టు టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం తొమ్మిది గంటలకు పోలవరం ప్రాజెక్ట్ వర్క్ ఏపీ జెన్కో కార్యాలయంలో ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి హాజరవుతారన్నారు. అందువల్ల కూటమి నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరురావాలని ఆయన కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ఎటపాక, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గౌరిదేవిపేటలో దళితుడైన పశువుల కాపరిపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాలల సంక్షేమ సంఘం డివిజన్ నేత గొల్లపల్లి శివబాబు డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై విచారణ అనంతరం అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. దాడి జరిగి, కులవివక్షకు గురైన గవ్వల వెంకటేష్‌కు ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందించాలన్నారు. అనంతరం వెంకటేష్ కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గోలి సురేష్, గోలి నర్సింహరావు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదికర్మ యోగా అభియాన్ సదస్సు

మోతుగూడెం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వై. రామవరం, డొంకరాయి, సిందివాడ, గంగవాడ గ్రామాల గిరిజనులతో ఆదికర్మ యోగా అభియాన్ సదస్సును పంచాయతీ సెక్రెటరీ రఘు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ హాజరై మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రజలందరూ మమేకమై స్థానిక సమస్యలను గుర్తించి పం చాయతీ వారికి నివేదిక ఇస్తే ఏర్పరచుకున్న లక్ష్యాలను ప్రాధాన్యత క్రమం ఆధారంగా ప్రభుత్వ సహకారంతో నెరవేర్చుకోవచ్చన్నారు. వార్డ్ మెంబర్ నీలాపు సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ గంగిరెడ్ల గుర్తుమూర్తి, టీడీపీ సీనియర్ నేత యాకోబు, సచివాలయ సిబ్బంది, గిరిజన సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

రేపు చలో గొంటువానిపాలెం

అడ్డతీగల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొంటువానిపాలెం నుంచి ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరం వరకు ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న రహదారి నిర్మాణ సమస్య పరిష్కారానికి శుక్రవారం తలపెట్టిన చలో గొంటువానిపాలెం కార్యక్రమానికి ప్రజానీకం కదలిరావాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు బుధవారం పిలుపునిచ్చారు. ఈ మేరకు లక్ష్మీపురం సెంటర్‌లో ఆ రోజు రాస్తారోకో, ఆందోళనలు చేపడతామన్నారు. వ్యాపారులు, ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ఉచితంగా పూజాద్రవ్యాల పంపిణీ

అడ్డతీగల,సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల పవనగిరి క్షేత్రంపై బుధవారం రాజమహేంద్రవరం షణ్ముఖ పీఠాధిపతులైన శ్రీస్కంద స్వామిజీ చేతులమీదుగా 70 గ్రామాలకు చెందిన గిరిజన పూజారులకు ఆయా ఆలయాల నిర్వహణార్థ అవసరమైన పూజాద్రవ్యాలను ఉచితంగా పంపిణీ చేసినట్టు పవన గిరి వ్యవస్థాపక అధ్యక్షుడు తనుకు వెంకట రామయ్య తెలిపారు.

రైతుల పేరుతో జగన్ అండ్ కో డ్రామాలు

- రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష


రంపచోడవరంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొన్న జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఛీ కొట్టినా బుద్ధి లేకుండా జగన్ అండ్ కో రైతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి మీడియాతో మాట్లాడారు. ఎరువులు, రైతుల పేరుతో జగన్ తనదైన మోసపూరిత శైలిలో డ్రామాలు సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయడాన్ని జగన్ తట్టుకోలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసిందని పేర్కొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పొంచి ఉన్న పెను ప్రమాదం

బీటలు వారిన విద్యుత్ స్తంభం


మధ్యలో బీటలతో ఉన్న స్తంభం

రౌతులపూడి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామశివారు ఏటికాలువ వంతెనకు కాస్తదూరంలో విద్యుత్ స్తంభం రూపంలో పెను ప్రమాదం పొంచి ఉంది. స్తంభం మధ్య విరిగిపోయి ఏ క్షణమైనా పడిపోయే విధంగా ఉంది. ఈ స్తంభం మీదుగా రౌతులపూడి సబ్‌స్టేషన్ నుంచి ఏలేరు కాలువ సమీపంలో గల డెయిరీఫామ్‌కు త్రీఫేజ్ 24 గంటలు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ స్తంభం ప్రధాన రహదారి పక్కనే ఉంది. నిత్యం కత్తిపూడి, కాకినాడ వేళ్లేందుకు అనేక వాహనాలు తిరుగుతుంటాయి. వ్యవసాయదారులు ఈమార్గంలో పొలం పనులకు వెళ్తుంటారు. స్తంభం కూలితే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉందని అధికారులు స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్‌లో ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. విజయోత్సవ సభకు లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయడం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని ఎమ్మెల్యే తెలిపారు.

టీటీడీ అన్నదాన ట్రస్టుకు విరాళం



జగ్గంపేట, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం వెదురుపాక మాజీ సర్పంచ్, తంటికొండ దేవస్థానం బోర్డు మెంబర్ రాజమండ్రికి చెందిన బొట్టా రామకృష్ణ సోదరుడు తలారి అనంత శ్రీనివాస్, తార దంపతులు కుమార్తె హసిత శ్రీఐశ్వర్య పేరున రూ.10,10,106 చెక్కును టీటీడీ అన్నదానం ట్రస్ట్‌కు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి అందజేశారు. తలారి అనంత శ్రీనివాస్ కుటుంబం, బొట్ట రామకృష్ణ శివలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన ఎమ్మెల్యే నెహ్రూ



జగ్గంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్ నియమితులయ్యారు. ఆయనను తిరుమలలో జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ మర్యాదపూర్వకంగా కలిసి అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రసాదం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న కాంట్రాక్టు వర్కర్స్ నాయకులు

కిర్లంపూడి, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే త్వరలో ఆందోళన చేపడతామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనివయన్ రాష్ట్ర కార్యదర్శి మిరియాల బాలకాశీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు అన్నా రు. కిర్లంపూడి మండలం చిల్లంగిఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జగ్గంపేట డివిజన్ అధ్యక్షుడు కాళ్ల భద్రాచలం అధ్యక్షతన కాంట్రాక్ట్ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా కాశీ, హనుమంతురావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా రాష్ట్రంలో ఉన్న 26వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులను విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

'ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలు'


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజావ్యతిరేక విధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు విమర్శించారు. ప్రత్తిపాడులోని లయన్స్ కమ్యూనిటీ హాల్లో బుధవారం నిర్వహించిన జిల్లా కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. రాష్ట్రం లోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్డీయే ప్రభు త్వం బలపరిచిన ఉప రాష్ట్రపతి అభ్యర్థికి ఓటు వేయడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రజా సమస్యలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో కూటమి ప్రభుత్వం ఆర్భాటాలు చేసుకోవడం తగదన్నారు. పార్టీ విధానాలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు. లిబరేషన్ నాయకులు ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం పాల్గొన్నారు.

జంక్షన్...టెన్షన్!


యర్రవరం జాతీయ రహదారి జంక్షన్

ఏలేశ్వరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యర్రవరం జంక్షన్ ప్రయాణికుల రాకపోకలకు టెంక్షన్‌గా మారింది. జాతీయ రహదారిపై ఉన్న ఈజంక్షన్ ప్రమాదాలకు నిలయంగా ఉండడంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తారు. రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏలేశ్వరం నుంచి వచ్చే వాహనాలు మలుపు తిరిగేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. జంక్షన్ వద్ద వీధి దీపాలు ఏర్పాటుతోపాటు సెక్యూరిటీ గార్డును నియమిస్తామని ప్రకటిస్తున్నా ఆచరణలో పెట్టడంలేదని, ఉన్నతాధికారులు స్పందించి జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా బోధన

శంఖవరం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యానికి అను గుణంగా బోధన ఉండాలని రాష్ట్ర కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కేజీబీవీ పాఠశాలను తన బృందంతో కలిసి పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్, మధ్యాహ్న భోజనం పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి ఆయనే మూల్యాంకనం చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.బాలామణికుమారి, కే.ప్రశాంతి, రావులపూడి వెంకటఅనంత లక్ష్మీ, జే.శ్రీవేణు పాల్గొన్నారు.

ఎరువులు ఎక్కువ వాడొద్దు

శంఖవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువులను అవసరం మేరకు వాడాలని, అధిక మొత్తంలో ఎరువులను వాడితే అనర్థమని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. బుధవారం గైరంపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సమగ్ర ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. హెక్టారుకు 250కిలోలు మాత్రమే యూరియా వినియోగించాలని, అది కూడా మూడు దఫాలుగా వేయాలన్నారు.

జనసేన బీమా చెక్కు అందజేత



జగ్గంపేట, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన జనసేన కార్యకర్త సిగిరెడ్డి రాంబాబు ఇటీవల ప్రమాదంలో మరణించగా బుధవారం అతడి ఇంటికి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు, జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ వెళ్లి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల బీమా చెక్కు అందించారు. పార్టీ జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు గవర సుధాకర్, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, జగ్గంపేట మండలా ధ్యక్షుడు మరిసే రామకృష్ణ, పాబోలు స్వామి, కురుమల్ల నాగేశ్వరరావు, నల్లల శివ, మారిశెట్టి రాధా, ఎలుబండి శివ, పారంశెట్టి రమేష్, సత్యంశెట్టి గణేష్ పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

గండేపల్లి, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): సింగరంపాలెం గ్రామంలోని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్‌రావును నియోజకవర్గ కమ్మ సంఘం నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసి జ్ఞాపిక అందించారు. కమ్మ సంఘం ప్రెసిడెంట్ కురుకూరి రాంబాబు, సంఘం పెద్దలు ముండ్రు ఎర్రబాబు, పాలచర్ల నాగేంద్ర చైదరి మాట్లాడుతూ పోతులకు డైరెక్టర్ పదవి రావడం సంతోషకరమన్నారు.


బావిని తొలగించి ప్రభుత్వ స్థలం కబ్జాకు పాల్పడుతున్న దృశ్యం

ప్రభుత్వ భూమి కబ్జా అడ్డగింత

తునిరూరల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తుని రూరల్ మండలం హంసవరంలో ప్రభుత్వ భూమిలో పురాతన బావిని కప్పి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వ్యక్తిని గ్రామానికి చెందిన పలువురు అడ్డుకున్నారు. బావి కబ్జాకు గురవుతోందని అధికారులకు మాజీ సర్పంచ్ కె.గంగారావు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది చేరుకుని పనులు ఆపారు. 67 సర్వే నెంబర్‌లో గల ఈ భూమి ఆక్రమణకు గురవడాన్ని ధ్రువీకరించిన రెవెన్యూ అధికారులు, పోలీసులు రామదాస్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు.


అన్నవరం సత్యదేవుడిని దర్శించుకున్న కన్నబాబు, తదితరులు

సత్యదేవుడి సేవలో ఖాదీ బోర్డు డైరెక్టర్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొమ్ముల కన్నబాబు బుధవారం అన్నవరం సత్యదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా తొలిసారిగా ఆయన సత్యదేవుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పండితులు, అర్చకులు స్వాగతం పలికారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధ్వానం.. ప్రత్తిపాడు-కిర్లంపూడి రహదారి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు-కిర్లంపూడి రహదారి పలుచోట్ల శిథిలమవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో భారీ ఎత్తున గుం తలు ఏర్పడటంతో వాహనాదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి అభివృద్ధికి ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీనుతో పాటు స్థానికులు, విద్యార్థులు, వాహనదారులు కోరుతున్నారు.


ప్రత్తిపాడు-కిర్లంపూడి రహదారి దెబ్బతిన్న దృశ్యం

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగ్గంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.21,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌లు, జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.


గోతులమయంగా ఉన్న దిప్పాలెం రహదారి

అధ్వాన రహదారి... అవస్థలు ఎన్నో!

రౌతులపూడి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరం నుంచి దిప్పాలెం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం పడితే చాలు గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు గోతుల్లోపడి తరచూ గాయపడిన ఘటనలున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారిని నిర్మించాలని ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ఆదిత్య వేద-2కే 25 టెక్ ఫెస్ట్ పోస్టర్ విడుదల

గండేపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 15, 16న నిర్వహించనున్న వేద-2కే25 టెక్ ఫెస్ట్ స్టూడెంట్స్ సింపోసియం సంబంధించిన పోస్టర్‌ను ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి విడుదల చేశారు. ఇంజనీరింగ్‌లో గల వివిధ బ్రాంచ్‌లతో పాటు మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ విద్యార్థులకు ఇందులో భాగస్వామ్యం కల్పించామన్నారు.

పెదశంకర్లపూడిలో మాజీ మంత్రి పర్యటన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో బుధవారం మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పర్యటించారు. అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు దోళే చిట్టిబాబు స్వగృహానికి విచ్చేసి పార్టీ నాయకులు, అభిమానులతో ఆయన మాట్లాడారు. అనంతరం తుని వెళ్లారు. కార్యక్రమంలో దోళే దొరబాబు, గంగాధర్ తదితరులు ఉన్నారు.



కోటనందూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలి

కోటనందూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లగుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సభలో పలువురు సభ్యులు మాట్లాడుతూ యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలపగా వ్యవసాయాధికారి కేజీ చంద్రశేఖర్ మాట్లాడుతూ యూరియా ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటనారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, డాక్టర్ కావ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ఓనం పండుగ విశిష్టతను వివరిస్తున్న విద్యార్థులు

'శ్రీ ప్రకాష్'లో ఓనం సంబరాలు

తునిరూరల్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ జూనియర్ కాలేజీలో ఓనం సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి పూజలు చేశారు. కేరళ పాటల నృత్యంతో అలరించారు. పలువురు విద్యార్థులు ఓనం పండుగ వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానుమూర్తి, ఉపాధ్యాయ బృందం, ఇన్‌చార్జ్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

'వెనుకబడిన వర్గాలకు తీవ్ర నష్టం'

జగ్గంపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌లో అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయం పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు తీవ్ర నష్టం వాటిల్లు తుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తుక నాగేశ్వరరావు ఆరోపించారు. ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు డాక్టర్ అయ్యే అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రైవేటీకరణను ఆపకపోతే రాష్ట్రస్థాయిలో బహుజనులందరూ ఏకతాటిపై ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.